క్లుప్తంగా

రూ.12 లక్షలతో డ్రెయిన్, సీసీ రోడ్డు నిర్మాణం



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామం 12వ వార్డులో గ్రామ పంచాయతీ నిధులు రూ.12 లక్షలతో డ్రెయినేజీ, సిమెంటు రోడ్డు నిర్మాణం పనులు జరుగుతున్నాయి. తొలిదశలో డ్రెయిన్ నిర్మిస్తున్నట్టు ఏఈ ఎస్.శివరామకృష్ణ తెలిపారు. పిమ్మట 110 మీటర్ల పొడవు, మూడున్నర మీటర్ల వెడల్పుతో సిమెంటు రోడ్డు నిర్మాణం చేస్తామన్నారు.

ఆశా వర్కర్లకు యూనిఫాం పంపిణీ



ఉంగుటూరు(గన్నవరం): మండల కేంద్రమైన ఉంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పనిచేస్తున్న ఆశా వర్కర్లకు మంగళవారం యూనిఫాం పంపిణీ చేశారు. మొత్తం 21 మంది ఆశా వర్కర్లకు రెండు జతల చొప్పున యూనిఫాం హెల్త్ సూపర్‌వైజర్ టి.సాల్మన్‌రాజు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజారోగ్య పరిరక్షణలో ఆశా వర్కర్లు మరింత మెరుగైన సేవలందించాలని చెప్పారు. ప్రభుత్వం అప్పగించే బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ఏఎన్ఎం శ్రీలక్ష్మి, పలువురు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోండి



కంకిపాడు: ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్.బసవయ్య సూచించారు. మండలంలోని ఈడుపుగల్లు, కంకిపాడు గ్రామ పంచాయతీల్లో ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహించారు. శిబిరాలను మంగళవారం ఆయన పరిశీలించారు. చిన్నారుల ఆధార్ నమోదు, సవరణలకు శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈనెల 7వ తేదీ నుంచి 8వ తేదీ వరకూ మద్దూరు పంచాయతీ కార్యాలయంలో ఆధార్ శిబిరం జరుగుతుందని తెలిపారు.

వికాస్ ఇంజినీరింగ్ కాలేజీ అవగాహన ఒప్పందం



నున్న(విజయవాడరూరల్): వికాస్ ఇంజినీరింగ్ కాలేజీ వారు దక్షిణ భారత్ రైల్వే వారి ఉమెన్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ తో మంగళవారం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందంతో విద్య, పరిశోధన, అభివృద్ధి పథకాలను పరస్పరం సహకారానికి ఉపయోగపడుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ పరమేశ్వరరావు తెలిపారు. ఇంటర్న్‌షిప్, పారిశ్రామిక సందర్శనలు, ప్రాజెక్టులు, ట్రెనింగ్ ఇచ్చే అంశాలపై దక్షిణ మధ్య రైల్వే అవగాహన ఒప్పందం ఉపయుక్తంగా ఉంటుందని రైల్వే ప్రతినిధి శాంసంగ్ దేవకుమార్ తెలియజేశారు. ఒప్పంద పత్రాలపై కళాశాల ప్రిన్సిపాల్, దక్షిణ మధ్య రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ కార్యదర్శి సంతకాలు చేశారు. ఇటువంటి ఒప్పందాల వల్ల కాలేజి విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంతో ఉద్యోగాలు, ఇతర అవకాశాలను సంపాదించుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందని డైరెక్టర్ ఎస్.కీర్తి ఆశాభావం వ్యక్తం చేశారు. డీన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పీఎం సూర్య ఘర్‌తో ప్రయోజనం



కంకిపాడు: పీఎం సూర్య ఘర్‌తో ప్రయోజనం చేకూరుతుందని నియోజకవర్గ ప్రత్యేక అధికారి మురళీకిషోర్ అన్నారు. పీఎం సూర్య ఘర్‌పై కాసరనేనివారిపాలెం పంచాయతీలో ప్రత్యేక సమావేశం మంగళవారం నిర్వహించారు. మురళీకిషోర్ మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన కాసరనేనివారిపాలెంలో పీఎం సూర్య ఘర్ సింగిల్ విండో ప్రత్యేక డ్రైవ్ చేపట్టామన్నారు. సూర్యఘర్ ఏర్పాటుతో విద్యుత్ ఆదాతో పాటుగా, ప్రతినెలా విద్యుత్ ఖర్చులు పొదుపు అవుతాయన్నారు. సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల ప్రత్యేకాధికారి విజయలక్ష్మి, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్.బసవయ్య, ఈఓఆర్‌డీ కిరణ్మయి, విద్యుత్ శాఖ ఏఈ టీ.అశోక్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి భూమి అన్యాక్రాంతం..?

- నిబంధనలకు విరుద్ధంగా దేవదాయశాఖ భూమిలో రోడ్డు
- ప్రైవేటు వెంచరు కోసం రోడ్డు నిర్మించిన రియల్టరు
- చోద్యం చూస్తున్న అధికారులు
- ఉన్నతాధికారులకు గ్రామస్తుల ఫిర్యాదుతో కదలిక
- ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన



వివాదాస్పదం అయిన రోడ్డు ఇదే



భూమి రికార్డులను పరిశీలిస్తున్న దేవదాయ శాఖ, రెవెన్యూ అధికారుల బృందం

కంకిపాడు: దేవదాయ శాఖ భూమిని కొందరు ఫలహారం చేసుకుని ఆరగించేందుకు రెడీ అయ్యారు. లక్షలు విలువ చేసే సాగు భూమిని నిబంధనలకు విరుద్ధంగా రోడ్డుగా మార్చి ఓ రియల్టరు ఏకంగా వెంచరు వేసేసి ప్లాట్లు అమ్మకానికి పెట్టేశారు. దీనిని గమనించిన కొందరు స్థానికులు జిల్లా కలెక్టరు సహా, దేవదాయ శాఖ, ఇతర అధికారులకు ఫిర్యాదులు చేయటంతో విషయం వెలుగుచూసింది. దీంతో దేవదాయశాఖ అధికారులు ఆఘమేఘాలపై రికార్డులతో సహా ఆ భూమిలో ప్రత్యక్షమై వివరాలను సేకరిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని నెప్పల్లి గ్రామ పరిధిలోని ఓ బడా రియల్టరు సుమారు 20 ఎకరాల్లో వెంచరు వేశారు. ఈ వెంచరులోకి వెళ్లేందుకు రహదారి మార్గం లేదు. అయినా సీఆర్‌డీఏ అధికారులు అనుమతులు ఇచ్చినట్లు చెబుతున్నారు. దీంతో ఆ రియల్టరు ప్రధాన రహదారికి అనుబంధంగా ఉన్న మరో వెంచరులో నుంచి తన వెంచరులోకి రోడ్డు నిర్మాణం పూర్తి చేసుకున్నాడు.

దేవదాయ భూమిలో రోడ్డు?

ప్రస్తుతం నిర్మించిన రోడ్డు వెంచరుకు సేకరించిన భూమిలో కాకుండా దేవదాయ శాఖకు చెందిన భూమిలో నిర్మించి తన పబ్బం గడుపుకోవటమే కాకుండా ప్లాట్లను విక్రయించినట్లు తెలుస్తోంది. ఆర్ఎస్ఆర్ ప్రకారం సర్వే నంబరు 101లో 4.41 ఎకరాల భూమి ఉంది. ఈ భూమి కనకదుర్గ అమ్మవారి దేవస్థానం కింద నమోదైంది. అయితే అడంగల్‌లో మాత్రం విజయవాడకు చెందిన ఓ సత్రం పేరుతో నమోదైంది. ఈ ప్రాంతంలో దేవదాయ శాఖకు చెందిన భూమి ఉందని తెలిసిన స్థానికులు రోడ్డు నిర్మాణాన్ని గుర్తించి అభ్యంతరం వ్యక్తం చేస్తూ జిల్లా కలెక్టరు, దేవదాయ శాఖ ఉన్నతాధికారులు, రెవెన్యూ శాఖలకు రాతపూర్వక ఫిర్యాదులు పంపారు. ఫిర్యాదులు అంది అధికారుల్లో చలనం వచ్చే నాటికి సంబంధిత రియల్టరు ఆ భూమిలో పక్కా రోడ్డును నిర్మించేసి, అంతర్గత రోడ్ల నిర్మాణాలు కూడా చేపడుతున్నారు.

సుమారు 20 సెంట్లలో రోడ్డు .. అధికారుల పరిశీలన

దేవదాయ శాఖకు చెందిన సుమారు 20 సెంట్ల భూమిలో రోడ్డు నిర్మాణం చేశారు. సెంటు రూ.4 లక్షల చొప్పున రూ.80 లక్షలు విలువైన భూమి అన్యాక్రాంతం అయినట్లుగా స్థానికులు ఆరోపిస్తున్నారు.

అధికారుల పరిశీలన..

గ్రామస్తుల ఫిర్యాదుతో దేవదాయ శాఖ అధికారులు ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ సృజన్, ఈఓ సుబ్బారెడ్డి నేతృత్వంలో బృందం నెప్పల్లి గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. ఆర్ఎస్ఆర్‌లో కనకదుర్గ దేవస్థానం భూమిగానూ, అడంగల్‌లో సత్రం భూమిగానూ నమోదైందని తేల్చారు. ఏదయినా దేవదాయశాఖ పరిధిలోనిదేనని, నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు వేయటం ఆక్రమణ కిందకే వస్తుందని అధికారులు పేర్కొన్నారు. దేవదాయశాఖ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాల్సి ఉందని, రికార్డుల్లో నమోదైన వివరాలను ఉన్నతాధికారులకు అందిస్తామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సృజన్ తెలిపారు.

ఈ ప్రశ్నలకు బదులేదీ?

వెంచరు నిర్మాణం చేసేందుకు పూర్తి స్థాయి సదుపాయాలు ఉన్నాయా?, లేవా? అని పరిశీలించకుండా సీఆర్‌డీఏ అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారన్న ప్రశ్న కూడా వ్యక్తమవుతోంది. గ్రామానికి చెందిన ఒకే వ్యక్తి ఏళ్ల తరబడి ఈ భూమిని లీజుకు తీసుకుని ఎలా సాగు చేస్తున్నారని?, సాగు భూమిని ఇతర అవసరాలకు మార్చుతుంటే ఎలా ఊరుకున్నారు.. అధికారుల చర్యలు ఏంటి? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈస్ట్ బైపాస్ నిర్మాణం ఈ ప్రాంతం పరిసరాల నుంచి వెళ్తుండటంతో భూములు, స్థలాలు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో రియల్టర్లు అక్రమార్జనకు తెగబడుతున్నార నటానికి ఈ ఘటనే నిదర్శనమని చెప్పుకుంటున్నారు.

రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి

గన్నవరం: స్థానిక గన్నవరం- ఆగిరిపల్లి ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులను వేగవంతం చేయాలని తహసీల్దారు కె.వెంకటశివయ్య అధికారులకు సూచించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం విస్తరణ పనులపై పలు శాఖల అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. జాతీయ రహదారి నుంచి పోలీస్‌స్టేషన్ వరకు తొలిదశ రోడ్డు విస్తరణ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికే కొంతమేర రహదారి ఆక్రమణలను తొలగించగా, మిగిలిన ఆక్రమణలను త్వరితగతిన తొలగించాలని సూచించారు. రోడ్డు విస్తరణలో భాగంగా ఇరువైపులా సీసీ డ్రెయినేజీ, ఫుట్‌పాత్‌ల నిర్మాణం చేపట్టనున్న దృష్ట్యా అడ్డుగా ఉన్న కరెంట్ స్తంభాలను మార్పు చేయాలని తెలిపారు. రోడ్డు విస్తరణకు సంబంధించి ఆయా శాఖలకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎంపీడీఓ టి.స్వర్ణలత, పంచాయతీరాజ్ ఏఈ దాసు, విద్యుత్ శాఖ ఏఈ వెంకటరాజు, పంచాయతీ కార్యదర్శి చెన్నకేశవరావు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

24న అంకదేవరతల్లి సంబరం

రామవరప్పాడు: గన్నవరం మండలం సావరగూడెంలోని శ్రీ అంకదేవరతల్లి ఆలయ 17వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 24న రాచమళ్ల వారి అంకదేవరతల్లి సంబరం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, ఎనికేపాడు వార్డు సభ్యులు రాచమళ్ల శ్రీనివాసరావు తెలిపారు. 24న సాయంత్రం 4 గంటలకు అభిషేకంతో పాటు పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. అనంతరం అంకదేవరతల్లి ఊరేగింపు, సంబరాన్ని వైభవంగా నిర్వహిస్తారన్నారు. ఈ సంబరానికి రాచమళ్ల సోదర, సోదరీమణులు, భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. 25న ఆదివారం అమ్మవారి అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

సీడీపీఓ బేబీ సుకన్య



గోసాలలో మాట్లాడుతున్న సీడీపీఓ బేబీ సుకన్య



మాట్లాడుతున్న సర్పంచి లక్ష్మీమౌనిక



కంకిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న కిశోర బాలికలు, అంగన్‌వాడీ సిబ్బంది

పెనమలూరు: కిశోర బాలికలు వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని సీడీపీఓ కె.బేబీసుకన్య అన్నారు. కిశోర వికాసం సమ్మర్ క్యాంప్‌లో భాగంగా మంగళవారం గోసాల సచివాలయం- 2 పరిధిలో గోసాల 7 అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ బేబీసుకన్య మాట్లాడుతూ 11 నుంచి 18 సంవత్సరాల వయస్సు కలిగిన బాలికల్లో శారీరక మార్పులు చోటు చేసుకుంటాయన్నారు. ఋతుస్రావం సమయంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. అదే విధంగా కిశోర బాలికలు గుడ్ టచ్- బ్యాడ్ టచ్‌పై అవగాహన ఉండాలన్నారు. జిల్లా లీగల్ ఆఫీసర్ శైలజ మాట్లాడుతూ ఆడపిల్లలకు ఆపద వచ్చిన సమయంలో వెంటనే తల్లితండ్రులకు, పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆడపిల్లలు క్రమశిక్షణతో మెలగాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.శ్రీలత, మహిళా కార్యదర్శులు తబిత, జయలక్ష్మి, కిశోర బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్య ప్రాధాన్యతను బాలికలు గుర్తించాలి

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి శివారు సుందరయ్యకాలనీలోని ఎంపీపీ పాఠశాలలో మంగళవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో 'కిశోర వికాసం'పై బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచి చేబ్రోలు లక్ష్మీమౌనిక మాట్లాడుతూ.. బాలికల సర్వతోముఖాభివృద్ధికి కిశోర వికాసం దోహదపడుతుందన్నారు. బాల్య వివాహాలు నియంత్రణకు మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌమార బాలికలకు ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కారం గురించి సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి ప్రియ వివరించారు. పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన జీవనం అలవర్చుకోవాలి

కంకిపాడు: ఆరోగ్యవంతమైన జీవనం అలవర్చుకోవాలని వక్తలు సూచించారు. మండలంలోని వివిధ సచివాలయాల పరిధిలో కిశోర వికాసం కార్యక్రమంపై అవగాహనా ర్యాలీలు, సదస్సులు మంగళవారం నిర్వహించారు. పునాదిపాడులో నిర్వహించిన ర్యాలీని ఉద్దేశించి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.అన్నామణి మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలన్నారు. కంకిపాడు, పరిసర గ్రామాలకు చెందిన సచివాలయాల పరిధిలో ర్యాలీలు నిర్వహించారు.

ఆంజనేయ స్వామిని దర్శించుకున్న ఎంపీ, ఎమ్మెల్యే

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక అభయాంజనేయ స్వామి దేవస్థానాన్ని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మంగళవారం దర్శించారు. హనుమంతునికి విశేష పూజలు చేశారు. ఈ నెల 17వ తేదీ నుంచి జరగనున్న హనుమజ్జయంతి ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఏటా మాదిరే ఈసారి కూడా ఘనంగా ఉత్సవాలు నిర్వహించాలని, దీనికి ఏర్పాటు చేయాలని దేవదాయ శాఖ అధికారులకు ఎంపీ పుట్టా, ఎమ్మెల్యే చింతమనేని సూచించారు. అనంతరం ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని పరిశీలించారు. యనమదల రామస్వామి ధర్మసత్రం ప్రాంగణంలో కల్యాణ మండపం నిర్మించాలనే ప్రతిపాదనల కోసం స్థల పరిశీలన చేశారు. కల్యాణ మండప నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేస్తామని ఎంపీ, ఎమ్మెల్యే చెప్పారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి పి.తారకేశ్వర మూర్తి, వేమూరి శ్రీనివాసరావు, పావులూరి రామారావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

పెనమలూరు: కానూరులో పార్కులో ఆటలాడుతూ గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక మృతి చెందటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం కానూరు మాణిక్యనగర్‌లో బొకినాల తులసమ్మ కుటుంబ సభ్యులతో నివశిస్తుంది. ఆమె కుమార్తె తేజశ్రీ (17) ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. కాగా గత నెల 20వ తేదీన తులసీనగర్‌లో ఉన్న పింగళి వెంకయ్య పార్కునకు సాయంత్రం 4 గంటలకు కుటుంబ సభ్యులతో వెళ్లి ఇనుప ఊయల ఊగుతూ ప్రమాద వశాత్తు కింద పడింది. ఆమె ఎడమ పక్కటి ఎముకలు విరగటంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సకై చేర్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక సోమవారం రాత్రి మృతి చెందింది. ఈ ఘటనపై తల్లి తులసమ్మ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

కదిలిపోయిన బెయిలీ బ్రిడ్జి రేకులు

ట్రాక్టరుకు తృటిలో తప్పిన ప్రమాదం



బ్రిడ్జిపై ఇరుక్కుపోయిన ట్రాక్టరును లాగుతున్న క్రేన్

కంకిపాడు: బెయిలీ బ్రిడ్జి రేకులు కదిలిపోవటంతో ఓ ట్రాక్టరుకు ప్రమాదం తృటిలో తప్పింది. మంగళవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు.. మండలంలోని కుందేరు గ్రామంలోని రైవస్ కాలువపై ఉన్న బెయిలీ బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. రేకులు కదిలిపోయి ఉన్నాయి. మంగళవారం లోడుతో వెళ్తున్న ట్రాక్టరుకు బ్రిడ్జి రేకు ఊడి ట్రాక్టరు చక్రానికి అడ్డం పడింది. దీంతో ట్రాక్టరు ప్రమాదానికి గురైంది. రేకులు అడ్డుపడటంతో కాలువలో పడకుండా ఆగింది. స్థానికులు క్రేన్ సాయంతో ట్రాక్టరును అతి కష్టం మీద బయటకు లాగటంతో ప్రమాదం నుంచి బయట పడింది.

సాయం కోసం రైతుల ఎదురుచూపులు



తడిచిన ధాన్యం ఆరబెడుతున్న రైతు

పెనమలూరు: ఈదురు గాలులు, వర్షంతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నుంచి సాయం కోసం ఎదురు చూస్తున్నారు. అయితే పచ్చపత్రికల్లో సాయంత్రానికల్లా సాయం అని చంద్రబాబు ప్రకటనలు చేసినట్లు రాతలురాసినా ఆచరణలో మాత్రం రైతులకు ఎటువంటి సాయం ప్రకటించకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అపార నష్టం..

ఆదివారం ఈదురు గాలులు, వర్షంతో పంటలకు నష్టం జరిగింది. ప్రధానంగా ఉద్యాన వన పంటలు అరటి, తమలపాకులు, బొప్పాయి, కూరగాయాల పంటలకు నష్టం వాటిల్లింది. ఇక వరి ధాన్యం వర్షానికి తడిచింది. నేటికీ ప్రభుత్వం ఎటువంటి సాయం ప్రకటించక పోవటంతో రైతులు ఆందోళనలో ఉన్నారు.

పంట నష్టం వివరాల నమోదు

మండల పరిధిలో ఉద్యాన పంటల నష్టం వివరాలను ఆ శాఖ అధికారులు నమోదు చేశారు. అరటి పంట 28.29 హెక్టార్లు, తమల పాకు తోటలు 4.95 హెక్టార్లు, బొప్పాయి 0.40, కూరగాయాలు 4.28 హెక్టార్లు నష్టం జరిగిందని అధికారులు పంటల వివరాలు నమోదు చేశారు. ఈ లెక్కన పంట నష్ట పరిహారం రూ.14,78,400 ప్రభుత్వం రైతులకు అందించాల్సి ఉంది. అరటికి హెక్టార్‌కు రూ.25 వేలు, తమల పాకులకు హెక్టార్‌కు రూ.75 వేలు, బొప్పాయి, కూరగాయల పంటలకు హెక్టార్‌కు రూ.25 వేల చొప్పున ప్రభుత్వం పంట నష్ట పరిహారం ఇవ్వాల్సి ఉంది.

తడిచి ధాన్యం సంగతేంటి..?

వర్షం కారణంగా తడిచిన ధాన్యానికి ప్రభుత్వం గిట్టుబాటు ధర ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం సకాలంలో ధాన్యం కొనుగోలు చేయక పోవటంతో చేతికి వచ్చిన ధాన్యం మిల్లులకు వెళ్లలేదు. దీంతో ధాన్యం దాదాపు 4 వేలకు పైగా బస్తాలు వర్షానికి తడిచాయి. రైతులు ధాన్యం ఎండపెడుతున్నారు. గిట్టుబాటు ధర ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. అధికారులకు స్పష్టమైన ఆదేశాలు రాలేదని చెబుతున్నారు.

డీపీవోకు సమ్మె నోటీసు ఇచ్చిన సీఐటీయూ

20న పంచాయతీ కార్మికుల సమ్మె



డీపీఓ కె.లావణ్య కుమారికి సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

విజయవాడరూరల్: ఈ నెల 20వ తేదీన దేశ వ్యాప్తంగా జరిగే కార్మికుల సమ్మెలో జిల్లాలోని పంచాయతీ కార్మికులు కూడా పాల్గొంటున్నారని సీఐటీయూ నాయకులు డీపీఓ కె.లావణ్య కుమారికి మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, 132, 142, 680 జీఓలు, టెండర్లపై హైకోర్టు తీర్పు అమలు తదితర డిమాండ్ల పరిష్కారానికి దేశవ్యాప్త సమ్మె జరుగుతుందని జిల్లా సీఐటీయూ నాయకులు ఎం. సోమేశ్వరరావు పేర్కొన్నారు. మన దేశానికి స్వాతంత్ర్యం రాక పూర్వమే బ్రిటిష్ కాలం నుంచి ప్రాణత్యాగాలు చేసి, పోరాడి సాధించుకున్న ట్రేడ్ యూనియన్ చట్టం- 1926, వర్క్‌మెన్ కాంపెన్సేషన్ యాక్ట్- 1923 వేతనాల చెల్లింపు చట్టం- 1935తో సహా కనీస వేతనాల చట్టం, 1948 బోనస్, గ్రాట్యూటీ, పీఎఫ్, ఈఎస్ఐ వంటి 20 చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లేబర్ కోడ్స్‌గా కార్మికుల హక్కులను హరిస్తాయని, సంఘం పెట్టుకునే హక్కును, సమ్మె హక్కును నిర్వీర్యం చేస్తున్నాయని సోమేశ్వరరావు తెలిపారు. ఫిక్స్‌డ్ టర్మ్ ఎంప్లాయ్మెంట్ విధానం ద్వారా ఉద్యోగ భద్రత లేకుండా కార్మికులను బానిసలుగా మార్చివేస్తాయని, వేతనాల కోసం బేరసారాలాడే హక్కులను కార్మికులు కోల్పోతారని, ఇలాంటి లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర, కార్మిక సంఘాలు 20న దేశవ్యాప్త సమ్మెకు పిలుపు నిచ్చాయన్నారు. డీపీఓను కలిసిన వారిలో విజయవాడ రూరల్ కార్యదర్శి పి. నరసింహారావు, పంచాయతీ యూనియన్ నాయకులు రామకోటయ్య, సీఐటీయూ నాయకులు అశ్రునికాంత్ పాల్గొన్నారు.

ఎనికేపాడులో మహీంద్రా షోరూమ్ ప్రారంభం



ఎనికేపాడులో మహీంద్రా షోరూమ్‌ను ప్రారంభిస్తున్న పవన్‌కుమార్, బనేశ్వర్ బెనర్జీ

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో ఆటోమోటివ్ మహీంద్రా షోరూమ్‌ను మంగళవారం ఆ సంస్థ ఏపీ సేల్స్, కస్టమర్ కేర్, సీఎక్స్ వైస్ ప్రెసిడెంట్ పవన్ కుమార్, నేషనల్ సేల్స్ హెచ్ బనేశ్వర్ బెనర్జీ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ కుమార్, బనేశ్వర్ బెనర్జీ మాట్లాడుతూ ఈ షోరూమ్‌లో 14 వాహనాలను ఒకేసారి ప్రదర్శించగల విశాలమైన స్థలం ఉందన్నారు. అన్ని రకాల వాహనాలు ఒకే చోట లభిస్తాయన్నారు. ఈ షోరూమ్‌లో 61 అధునాతన సర్వీస్ బేలు ఉన్నాయని, ఇవి సంవత్సరానికి సుమారు 28 వేల మంది కస్టమర్లకు సులభంగా సేవలందిస్తాయని తెలిపారు. అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ నారాయణ, హర్ష్ మెహతా మాట్లాడుతూ గత ఏడాది 37 వేల మహీంద్రా వాహనాలను విక్రయించామన్నారు. ఏఎంపీఎల్ దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న డీఈఎం కోసం అతి పెద్ద సేల్స్, ఆఫ్టర్ సేల్స్ భాగస్వామిగా నిలిచిందన్నారు. రూ. 5 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఏఎంపీఎల్ ఈ డీలర్‌షిప్ కృష్ణా జిల్లాలో ఐదోదన్నారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజీవ్ సింగ్వి, వినియోగదారులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మేధో వికాసం



తెన్నేరు గ్రంథాలయంలో శ్లోకాలు చదువుతున్న విద్యార్థులు

కంకిపాడు: పుస్తక పఠనంతో మేధో వికాసం కలుగుతుందని వక్తలు పేర్కొన్నారు. వేసవి శిక్షణ శిబిరాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. మంగళవారం తెన్నేరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో పుస్తక పఠనం, శ్లోక పఠనం, కథల పుస్తకాలు చదివించటం, ఆటలు, పాటలు నేర్పించారు. శిబిరాన్ని గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం, యోగ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. శిబిరాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు.

డ్రాయింగ్ పోటీల్లో ఉత్సాహంగా విద్యార్థులు

గన్నవరం: ఉంగుటూరు, గన్నవరం మండలాల్లోని గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమశ్రేణి గ్రంథాలయంలో మంగళవారం గణితం సబ్జెక్ట్‌పై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయ కమిటీ సభ్యులు చిమట రామారావు, లైబ్రేరియన్ పీడీ లక్ష్మి, విశ్రాంత ఉద్యోగి ధర్మారావు, సిబ్బంది పాల్గొన్నారు. ఉంగుటూరు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రంగురంగుల బొమ్మలను తీర్చిదిద్దారు. లైబ్రేరియన్ చంద్రశేఖర్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు. పురుషోత్తపట్నం, ముస్తాబాద గ్రంథాలయాల్లో కూడా విజ్ఞాన శిబిరాలు కొనసాగుతున్నాయి.

వీరవల్లి గ్రంథాలయంలో..

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు దేశ భౌగోళిక శాస్త్రం, జనరల్ నాలెడ్జి పుస్తకాలు, వాటి అవశ్యకతను గ్రంథాలయ అధికారి పి.స్వర్ణలతాదేవి వివరించారు. జాతీయ పతాకం, జాతీయ గేయం వంటి విశేషాలను విద్యార్థులకు వివరించారు. జనరల్ నాలెడ్జి పుస్తకాలను విద్యార్థులతో చదివించారు. అనంతరం ఆటలు ఆడించి, నృత్య శిక్షణ తరగతులు నిర్వహించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

పెనమలూరు: పోరంకిలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెంది ఘటన పై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ జె.వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. పోరంకికి చెందిన కుప్పిలి లక్ష్మణరావు (60) పోరంకిలో స్వీట్ షాపులో పని చేస్తాడు. అతను ఈ నెల 4వ తేదీ రాత్రి పెనమలూరు సెంటర్‌లో కిరాణా షాపునకు సరుకులకు వెళ్లి విజయవాడ- మచిలీపట్నం జాతీయ రహదారి దాటుతుండగా అతనిని విజయవాడ నుంచి కంకిపాడు వైపునకు వెళుతున్న కారు ఢీ కొట్టింది. విజయవాడలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న లక్ష్మణరావు మృతి చెందాడు. మృతుడి కుమార్తె భాగ్యలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చిన్నారుల ఆరోగ్య సమస్యలు గుర్తించండి

పెనమలూరు: పెనమలూరులో మంగళవారం ఆశా డే నిర్వహించారు. జిల్లా ఫ్లోరో సిస్ కన్సల్‌టెంట్ డాక్టర్ బదిరీనారాయణ మాట్లాడుతూ ఆశా వర్కర్లు ప్రతి ఇంటికీ సర్వే చేసి 0- 5 సంవత్సరాల చిన్నారులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు గుర్తించాలని సూచించారు. ఫ్లోరోసిస్ బాధితుల కోసం విటమిన్ సీ ట్యాబ్‌లెట్లు ఆశా వర్కర్లకు పంపిణీ చేశారు. గతంలో గుర్తించిన బాధితులకు నెక్ బెల్టు, వీల్‌చైర్‌లు అందజేశారు. మండల వైద్యాధికారి సాయిలలిత, డాక్టర్ బిజిలీ శ్రీనివాస్, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.